# మండలం ఆఫీసులో అవినీతి

రంపచోడవరం, జనవరి 25 (టెలిన్యూస్): స్థానిక మండలం ఆఫీసులో విలేజి అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సూర్యనారాయణను ఈ నెల 19వ తేదీన లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏ.సి.బి. అధికారులు అతన్ని అరెస్టు చేశారు. సొంతపూచీకత్తుపై ఉద్యోగిని విడుదల చేసిన తర్వాత వెంటనే సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

విలేజి అసిస్టెంట్ అవినీతి భాగోతం పూర్వాపరాలీ విధంగా ఉన్నాయి. స్థానిక స్వచ్ఛంద సంస్థ 'శక్తి'కి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ చింతపండు కొనుగోలు కోసం 20వేల రూపాయలివ్వగా, శక్తి నిర్వాహకులు అందులో 7,600 రూపాయల్ని బుస్సిగూడెం ప్రాంతంలో చింతపండు కొనమని బి.ఆదినారాయణ అనేశక్తి కార్యకర్తకు అప్పగించారు. అయితే, ఇతను 4వేల రూపాయల చింతపండు మాత్రమేకొని, మిగతా సొమ్మును కైంకర్యం చేశాడు. ఈ విషయం గ్రహించిన శక్తి డైరెక్టర్ శివరామకృష్ణ తమ కార్యకర్త ఆదినారాయణను పిల్చి అడగ్గా, తాను భాస్కరరావు అనే వ్యక్తికి మిగతాసొమ్ముకు చింతపండు అమ్మేశానని ఒప్పుకున్నాడు. భాస్కరరావును అడగ్గా, దొంగసొత్తు చింతపండును దేవరపల్లిలో దాచానని, అందజేస్తానని అన్నాడు. అప్పటికి చింతపండు రేటు పెరిగింది. శక్తి నిర్వాహకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా, 40 రోజులు గడిచినా ఎటువంటి చర్య తీసుకోకపోవడంతో డి.ఎస్.పి.కి తెలిపారు. పోలీసులు తక్షణం కదిలి నిందితులైన ఆదినారాయణ, భాస్కరరావులను అదుపులోకి తీసుకున్నారు. భాస్కరరావు జామీనుమీద విడుదల కాగా, ఆదినారాయణకు బెయిల్ మంజూరు కాలేదు. దానితో అతని తరఫువారు మేజిస్ట్రేట్ అయిన మండలాధికారి వద్దకు వెళ్ళి ధ్రువీకరణ పత్రం కోసం యత్నించారు. ఈ లోగా ఆదినారాయణను సెంట్రల్ జైల్‌కి పంపారు. 20రోజుల తరవాత కూడా బెయిల్ రాలేదు.

ఆదినారాయణకు బెయిల్ సర్టిఫికేట్ కావాలంటే మండలం ఆఫీసులో రెండువేల రూపాయలు అడిగారని శక్తి కార్యకర్తలు తెలిపారు. అయితే ఆదినారాయణ అంత ఇచ్చుకోలేమని చెప్పగా విలేజిఅసిస్టెంట్ సూర్యనారాయణ, మండలాధికారి వద్దకు వెళ్ళి తెలుపగా, ఆయన కనీసం వెయ్యి అడిగారని, అందుకు తాము 600 ఇస్తామన్నామని కార్యకర్తలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, శక్తి కార్యకర్తలు ఈ లోపాయికారీ అవినీతి వైనాన్ని రాజమండ్రి వెళ్ళి ఏ.సి.బి. అధికారులకు ఉప్పందించారు. 17న ఏ.సి.బి. అధికారులు ఊళ్ళోకి వచ్చారని తెలియడంతో మండలం ఆఫీసులో లంచం తీసుకోలేదు. అయితే 19న మళ్ళీ బెయిల్ సర్టిఫికేట్ కోసం వెళ్ళిన కార్యకర్తలు విలేజి అసిస్టెంట్‌కు లంచమిస్తుండగా, పొంచివున్న అవినీతి నిరోధక అధికారులు రుజువులతో సహా పట్టుకున్నారు. వి.ఎ.ని వెంటనే సస్పెండ్‌చేసి స్టేట్‌మెంట్ తీసుకోగా, ఈ అవినీతిలో మండలాధికారికి, హెడ్ గుమాస్తాకి, అటెండర్‌కి, డ్రైవర్‌కి కూడా భాగస్వామ్యం ఉందని అతను వెల్లడించాడు. ఇతని మూలంపై వీరిని కూడా సస్పెండ్ చేస్తారని తెలుస్తోంది.